
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
3
జిల్లా వార్తలు
శుక్రవారం 16 ఆగస్టు 2024





జెండాకు సెల్యూట్ చేస్తున్న అధికారులు

అగ్రగామిగా నిలపాలి

ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

- రాష్ట్రంలో నిజమైన పాలన
- ఒక్కొక్కటిగా అభయహస్తం హామీల అమలు
- అర్హులందరికీ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- నీతి, నిజాయతీతో నిస్వార్థంగా, పారదర్శకంగా పనిచేయాలి
- కలెక్టరేట్‌లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు
- జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం సలహాదారు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 15 : జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, రాష్ట్రంలో ప్రజల కోసం నిజమైన ప్రజాపాలన సాగుతుందని ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజాపాలన సాగిస్తున్నట్లు, ప్రజలందరికీ సామాజిక న్యాయం, సమానావకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఇంటింటా సౌభాగ్యాన్ని నింపాలనే మహా సంకల్పంతో రూపొందించిన అభయహస్తం హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ గ్రామసభల ద్వారా 2023 డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6 వరకూ అభయహస్తం గ్యారంటీల కోసం ప్రజల నుంచి 5,09,849 దరఖాస్తులు స్వీకరించామన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే మా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి రాష్ట్రంలో జిల్లాను వివిధ రంగాలలో అగ్రగామిగా నిలపాలని తెలిపారు. అంకితభావం, నీతి, నిజాయితీ, నిస్వార్థంగా, పారదర్శకంగా పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

ప్రయాణ ఛార్జీల కింద రూ. 355.74 కోట్లు ఆదా

ఆరు గ్యారంటీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు వేం నరేందర్‌రెడ్డి చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 14.59 కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుని రూ. 355.74 కోట్లు ప్రయాణ ఛార్జీల రూపంలో ఆదా చేసుకున్నారని తెలిపారు.

రూ.500కే వంటగ్యాస్ సిలిండర్

మహిళల కష్టాలను తెలుసుకున్న కాంగ్రెస్ సర్కార్ మహాలక్ష్మీ పథకం కింద రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు నరేందర్‌రెడ్డి తెలపారు. జిల్లాలో ఈ పథకం కింద 1,93,519 కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, 1,43,946 సిలిండర్లకు గాను రూ. 4.30కోట్లు సబ్సిడీ కింద ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు.

3.33 లక్షల కుటుంబాలకు జీరో విద్యుత్ బిల్..

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించిన 3,33,000 కుటుంబాలకు జీరో బిల్ జారీ చేసినట్టు నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ జీరో బిల్లులకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.12.62 కోట్లు సబ్సిడీగా చెల్లించినట్లు చెప్పారు.

విజయవంతంగా రుణమాఫీ..

రైతన్నలకు రూ. 2లక్షలు రుణమాఫీ చేసే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. మన జిల్లాలో మొదటి దశలో 49,471 మంది రైతులకు రూ. 257.19 కోట్ల రుణ మాఫీ కాగా, రెండవ దశలో 22,915 మంది రైతులకు రూ.218.13 కోట్లు మాఫీ చేశామని, 3వ దశ కూడా మాఫీ అయిందన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న జిల్లా

అభివృద్ధి పథంలో ఎదుగుతున్న రంగారెడ్డి జిల్లా మన రాష్ట్ర తలసరి ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉందని వేం నరేందర్‌రెడ్డి తెలిపారు. రాజధాని అనుసంధాన నగరాలలో ఒకటిగా నిలిచి, పెట్టుబడులను ఆకర్షించడంలో ముందున్నట్లు చెప్పారు. జిల్లాలో పరిశ్రమలను స్థాపించడానికి, అవసరమైన అన్ని మౌలిక వసతులు కలిగి ఉండి, జిల్లా యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు అవకాశాలను కల్పించబోతుందని చెప్పారు. జిల్లా అభివృద్ధిలో ఇదో గొప్ప మైలురాయని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా టీజీఐఐసీ ద్వారా చేపడుతున్న నెట్ జీరో సిటీ, ఫోర్త్‌సిటీ ఏర్పాటులో భాగంగా మీర్‌ఖాన్‌పేట్, ముచ్చర్ల వేదికగా సుమారు రూ.100 కోట్ల వ్యయంతో నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయంతో పాటు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ఏటీసీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. ఆ ప్రాంతాన్ని కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ ఏర్పాటులో స్థానిక ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వేగంగా ఆ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధానికి ఇరువైపులా ఉన్న రంగారెడ్డి జిల్లా సహజమైన వనరులు కలిగి ఉండడంతో సంపదలో ముందున్న జిల్లాగా పేరు గాంచిందన్నారు. అధిక వ్యవసాయం, అధిక పెట్టుబడుల్లో ముందుకెళ్లడంతో పాటు రియల్ ఎస్టేట్ రంగంలోనూ పరుగులు తీస్తుందన్నారు. అదే తరుణంలో జిల్లాలోని విలువైన ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జాదారుల బారిన పడకుండా కలెక్టర్ ఆధ్వర్యంలో రెండు టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు చేశామన్నారు. కమిటీల వద్దకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారని నరేందర్‌రెడ్డి చెప్పారు.

హాజరు కాని సమరయోధులు

ప్రతి ఏటా స్వాతంత్ర్య దిన వేడుకల్లో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించి వారికి జ్ఞాపికలను అందించేవారు. అయితే, ఈసారి ఎవరూ హాజరు కాలేదు. సమరయోధులు వయో వృద్ధులు కావడంతో ఇక్కడకు రాలేక పోయారని, ఇంటి వద్దకు వెళ్లి వారిని సన్మాస్తామని అధికారులు ప్రకటించారు.

కనిపించని శకటాలు

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు ప్రజలకు వివరించేలా వివిధ శాఖలు ప్రతీసారి శకటాలు ఏర్పాటు చేసి ప్రదర్శించేవారు. ఈ సారి శకటాలు కనిపించలేదు. ర్యాలీ నిర్వహించలేరు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వేం నరేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న వేం నరేందర్‌రెడ్డి

మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు

వ్యవసాయ,వ్యవసాయేతర జీవనోపాధి పెంచడానికి స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా రుణాలను అందించడం జరుగుతుందని నరేందర్‌రెడ్డి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 15,570 సంఘాలకు రూ. 580.39 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 2,917 సంఘాలకు రూ. 270.82 కోట్ల రుణాలను అందచేయడం జరిగిందన్నారు. స్త్రీ నిధి సంస్థ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 74.80 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ. 3.20 లక్షల రుణాలను మహిళలకు అందచేయడం జరిగిందని చెప్పారు.

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా..

ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులు కబ్జాలకు గురికాకుండా నిరోధించడానికి హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సంస్థను అందుబాటులోకి తెచ్చామని వేం నరేందర్‌రెడ్డి అన్నారు.. ఈ సంస్థ సర్కారీ ఆస్తుల పరిరక్షణతోపాటు, విపత్తులు సంభవించినప్పుడు అత్యవసర సేవలను కూడా అందిస్తుందన్నారు. ఇతర సహాయక సంస్థలతో కలసి పనిచేస్తున్నట్లు, హైడ్రాకు ముఖ్యమంత్రి ఛైర్మన్ గా ఒక పాలక వర్గం కూడా ఉంటుందన్నారు.. ఇది హైడ్రా పనితీరును పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

రాష్ట్రంలో డ్రగ్స్ మాట వినపడకూడదని, కనపడకూడదని ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకొంటున్నట్లు వేం నరేందర్‌రెడ్డి తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు జీరో టాలరెన్స్ పద్ధతిని అనుసరిస్తున్నట్లు చెప్పారు. కళాశాలలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ గంజాయి అమ్మకాలు సాగుతుండటంతో వాటిని ఎదుర్కోవడానికి సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలు..

జిల్లాలో అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు వేం నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక పురస్కారాలు అందజేశారు. మొత్తం 161 మంది ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు.

వైద్యరంగంలో అద్భుత ప్రగతి..

మన జిల్లా వైద్య, ఆరోగ్యరంగంలో అద్భుతమైన ప్రగతి సాధించిందఇ వేం నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని 25 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 65 బస్తీ దవాఖానాలు, 158 పల్లె దవాఖానాలు ద్వారా ప్రజల ఆరోగ్య ప్రమాణాలను మెరుగుపర్చడానికి గణనీయమైన సేవలు అందించే స్థాయికి మన జిల్లా చేరిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అందించే వైద్యచికిత్సల పరిమితిని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని, ఆరోగ్యశ్రీ పథకంలో కొత్తగా 163 చికిత్సలను చేర్చామని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ పథకం కింద 10,3,89 మంది వైద్య సేవలను పొందారని ఆయన చెప్పారు. ఎంబీబీఎస్ చదవడం ప్రతీ పేదవారి కల అని వేం నరేందర్‌రెడ్డి తెలిపారు. నేటి ఆర్థిక స్థితిగతుల్లో వైద్య విద్య చదవడం కలగా మిగిలిపోయిందన్నారు. నాడు జిల్లాలో ఏ ప్రాంతం వారికి పెద్ద రోగం వచ్చినా హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, నిమ్స్ దవాఖానలే దిక్కుగా ఉండేవన్నారు. దీంతో సకాలంలో వైద్య సదుపాయాలు అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితిని జిల్లాలో చూశామని, ఆ దుస్థితిని అధిగమించడానికి జిల్లాకు వైద్య కళాశాలను త్వరలో అందుబాటులోకి తీసుకు రాబోతున్నట్లు చెప్పారు.



ఉత్సాహ భరితంగా విద్యార్థుల కళా ప్రదర్శనలు

పంద్రాగస్టు వేడుకల సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎదనిండా దేశభక్తిని నింపుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందేలా ఆకట్టుకునే తీరులో కార్యక్రమాలు ప్రదర్శించారు. కడ్తాల్ కేజీబీవీ విద్యార్థినులు, ఎల్బీనగర్ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్, నాదర్‌గుల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, తుర్కయంజాల్‌లోని చిల్డ్రన్ హోమ్స్, తుక్కుగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, డీఆర్వో సంగీత, కలెక్టరేట్ ఏవో సునీల్, తెలంగాణ పట్టణ, ఆర్థిక మౌలిక సదుపాయాఆల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాల్స్..

పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన, పౌరసరఫరాలు, విద్యుత్ శాఖలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. అక్కడికి వచ్చిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు స్టాల్స్‌ను సందర్శించారు. ఆయా శాఖల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను స్టాల్స్ ద్వారా వివరించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కింద 762 బడులు

జిల్లాలో మొత్తం 1,342 పాఠశాలలు ఉండగా అందులో 762 అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసినట్లు వేం నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎంపిక చేసిన పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.22.30 కోట్లు మంజూరు చేశామని, ఇప్పటి వరకు 358 పాఠశాలలో పనులు పూర్తి కాగా 408 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.

ఈ ఏడాది 28వేల ఇందిరమ్మ ఇళ్లు

పేద, బడుగు వర్గాల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో నూతన గృహనిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించామని నరేందర్‌రెడ్డి చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రతీ నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్ల చొప్పున ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 28 వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈ పథకం కింద పేదలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.6 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు.

పారిశ్రామికాభివృద్ధికి కీలక చర్యలు

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టినట్లు నరేందర్‌రెడ్డి చెప్పారు. పారిశ్రామిక రంగానికి నిరంతరాయంగా 24 గంటలు విద్యుత్తు సరఫరా జరుగుతుందని నరేందర్‌రెడ్డి తెలిపారు. టీజీఐపాస్ ద్వారా మైక్రో75, స్మాల్ 48, మీడియం 15, లార్జ్ 5, మెగా లార్జ్ 8 పరిశ్రమలను రూ.5,946 కోట్ల పెట్టుబడితో స్థాపించేందుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. వీటి ద్వారా 9,936 మందికి ఉపాధి కల్పించనున్నామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు రూ.3.30 కోట్లు మంజూరు..

జిల్లాలో 606 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతుల కోసం ఇప్పటి వరకు రూ. 3.30 కోట్లు మంజూరు చేశామని నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు అనుసంధానించబడిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఉచిత యూనిఫాంలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ విద్యా సంవత్సరం నుండి అంగన్‌వాడీలలో కొత్తగా సిలబస్‌ను కూడా మార్పు చేశామని చెప్పారు.

మహిళా సంఘాలకు రూ.283.88 కోట్ల చెక్కు

బ్యాంకు లింకేజీ కింద 3,069 మహిళా సంఘాలకు రూ.283.88 కోట్ల చెక్కును జీవన జ్యోతి జిల్లా మహిళా సమాఖ్య పేరిట రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక అందజేశారు. ఆర్థిక పునరావాస పథకం కింద లబ్ధిదారులకు రూ.20 లక్షల రూపాయల చెక్కును అందించారు.

రైతుకు 'భరోసా'

రైతు భరోసా పథకంలో భాగంగా జిల్లాలో యాసంగి 2024 సీజన్‌కు గాను 3,25,217మంది రైతుల ఖాతాల్లోకి రూ.343.11కోట్లు జమ చేశామని వేం నరేందర్‌రెడ్డి తెలిపారు. అలాగే రైతు బీమా పథకం ద్వారా జిల్లాలో డిసెంబర్ 2023 నుండి ఇప్పటి వరకు 653మంది రైతులకు రూ.32.65 కోట్లు రైతుల నామినీ ఖాతాలలో జమ చేశామన్నారు.



ఇంటింటా ఇన్నోవేటర్ ప్రదర్శన

ఆకట్టుకున్న ఇన్నోవేటర్.. వినూత్న ఆవిష్కరణల స్టాల్

స్వాతంత్ర్య దిన వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటింటా ఇన్నోవేటర్ వినూత్న ఆవిష్కరణల స్టాల్ ఆకట్టుకుంది. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ప్రదర్శనలో బానూరు జ్యోతి పోర్టబుల్ గ్రైండర్, వినేష్ ఆవిష్కరించిన ఎంపవరింగ్ లైఫ్ సేవింగ్ మెషిన్, చరిస్మా ఆవిష్కరణ ఏకో ఫ్రండ్లీ మెన్స్ట్రల్ ఇన్సినేటర్, కౌశిక్ ఆవిష్కరణ డిజైన్ అండ్ ఫాబ్రికెకాన్ అఫ్ చిపియింగ్ ఆకట్టుకున్నాయి.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న వేం నరేందర్‌రెడ్డి



మహిళా సంఘాలకు చెక్కు అందజేత

రుణమాఫీ చివరి దశ పూర్తి

- ఉమ్మడి జిల్లాలో 34,453 మందికి రూ.437.32కోట్లు మాఫీ
- రూ.2లక్షల వరకు అప్పు తీసుకున్న రైతులకు రుణ విముక్తి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)



కాంగ్రెస్ సర్కార్ ముందు ప్రకటించిన విధంగానే రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేసి రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే రైతులకు రూ. 2లక్షల లోపు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి విదితమే. ఈ మేరకు రైతు రుణమాఫీకి మార్గదర్శకాలు కూడా విడుదల చేసింది. పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్న వారందరికీ రుణమాఫీ చేస్తామని వెల్లడించింది. ఆగస్టు 15లోగా అర్హులైన వారందరికీ రుణమాఫీ చేసే ప్రక్రియ పూర్తి చేస్తామని గతంలో ప్రకటించిన ప్రభుత్వం మూడు దశల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు గత నెల 18వ తేదీన తొలి విడత రూ.లక్ష లోపు రైతు రుణాలను మాఫీ చేసింది. అలాగే గత నెల 30వ తేదీన రూ. లక్షన్నర లోపు రుణాలను మాఫీ చేసింది. ఇక చివరి విడతగా గురువారం రెండు లక్షల రూపాయల లోపు ఉన్న రుణాలన్నీ కూడా మాఫీ చేసింది. ఉమ్మడి జిల్లాలో అధికారులు గురువారం 34,453 మంది రైతులకు రూ. 437.32 కోట్ల రుణమాఫీ చేశారు. నేరుగా ఈ రుణ మాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసింది. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయల లోపు పూర్తిగా రుణ మాఫీ చేయడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటు న్నాయి. స్థానిక ఎన్నికల్లో దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించి భారీగా ఓట్లు సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది.

మూడో విడత రుణమాఫీ వివరాలు

జిల్లా	లబ్ధిదారులు	మాఫీ(రూ.కోట్లు)
రంగారెడ్డి	15,226	185.40
వికారాబాద్	18,885	247.71
మేడ్చల్	342	4.21



కార్ఖానాలో చెలరేగిన మంటలు

కార్ల మరమ్మతు కార్ఖానాలో అగ్నిప్రమాదం

రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 15 : కార్ల మరమ్మతు కార్ఖానాలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటన గురువారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపల్ పరిధి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులు కార్ల కార్ఖానాతో పాటు స్క్రాప్ షాప్, రెండు మెకానిక్ షాప్‌లు నిర్వహిస్తున్నారు. గురువారం ఒక్కసారిగా కార్ల మరమ్మతు కార్ఖానాలో మంటలు చెలరేగాయి. స్క్రాప్‌షాప్‌తో పాటు మెకానిక్ షాప్‌లకు మంటలు వ్యాపించారు. దాంతో ఒక ఇన్నోవా కారు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు భయందోళనతో పరుగులు తీశారు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. దాదాపు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని షాపుల యాజమానులు పేర్కొన్నారు. ఆర్‌జీఐఏ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచానామా చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో గురువారం రాత్రి పలుచోట్ల భారీగా వర్షాలు కురిశాయి. ముఖ్యంగా నగర శివార్లలో వర్షాలు దంచి కొట్టాయి. సరూర్‌నగర్‌లో అత్యధికంగా 8.4 సెం.మీ, మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లిలో 7సెం.మీ వర్షపాతం నమోదైంది. బాలానగర్‌లో 6.5 సెం.మీ, దుండిగల్‌లో 5.4 సెం.మీ వర్షం కురిసింది. అలాగే రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో 5.6 సెం.మీ, గండిపేట, శంకర్‌పల్లిలో 3.6, మహేశ్వరంలో 3.2, మొయినాబాద్‌లో 3.0 సెం.మీ వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా వికారాబాద్‌లో 3సెం.మీ, నవాబుపేటలో 2.8 సెం.మీ, కోట్‌పల్లిలో 1.2 సెం.మీ వర్షం కురిసింది. వర్షంతో రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి.



వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

జెండా గౌరవాన్ని కాపాడాలి

కొడంగల్, ఆగస్టు 15: ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయడంతో పాటు జాతీయ జెండా గౌరవాన్ని కూడా కాపాడాలని సీపీఐ కొడంగల్ నియోజకవర్గ నాయకులు ఇందనూర్ బషీర్, ఎండీ.మైమూద్, శ్యామ్‌సుందర్ తదితరులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పరిగి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

పరిగి, ఆగస్టు 15: అమెరికా పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి 12 రోజుల పాటు అమెరికాకు వెళ్లిన సంగతి తెలిసిందే. అమెరికా పర్యటన ముగించుకుని గురువారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అంతకుముందే పార్టీ శ్రేణులు ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు భారీగా ప్రత్యేక వాహనాల్లో ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. అక్కడ రామ్మోహన్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో ఘనంగా స్వాగతంపలికి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే పరిగి నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పూడూరు: విదేశాల పర్యటన ముగించుకుని వచ్చిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గురువారం పూడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఎగరవేశారు.

వైభవంగా వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న ఆలయ పూజారులు

శామీర్‌పేట, ఆగస్టు 15: శామీర్‌పేటలో శ్రీవీరభద్రస్వామి విగ్రహా ప్రతిష్ఠాపన ఉత్సావాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రామాలయం నుంచి శ్రీవీరభద్రస్వామి ఆలయం వరకు విగ్రహాలను భక్తి శ్రద్ధలతో కేరళ వాయిద్యాలతో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున విగ్రహాలకు నీళ్లతో సాకలు పెట్టి పూజలు చేశారు. శ్రీభవానిరామలింగేశ్వరస్వామి (శివాలయం) ఆలయం ప్రధానర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో 18 మంది పూజలు చేశారు. ముందుగా గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, మాతృక, యోగిని వాస్తు, సర్వతోభద్ర, నవగ్రహపూజ, అగ్నిఉత్తారం, అగ్నిస్థాపనం, విగ్రహాల యంత్ర పూజ, జలాధివాసం, అదివాసాల పూజ, అర్చన, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, శ్రీకట్టమైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు ఘన సన్మానం



మాధవరెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు, ఉపాధ్యాయులు

బషీరాబాద్, ఆగస్టు 15: బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మాధవరెడ్డికి స్వగ్రామమైన జీవన్గిలో గురువారం స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి సహకారంతో అత్యధికంగా నిధులు తీసుకువస్తానన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకు నెలనెలా వచ్చే గౌరవ వేతనాన్ని పాఠశాలలకు ఇస్తానని వెల్లడించారు. అనంతరం స్థానికుడు డిక్షనరీలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన కార్యదర్శికి సత్కారం



పర్వత్‌పల్లిలో బదిలీపై వెళ్లిన కార్యదర్శిని సన్మానిస్తున్న నర్సిరెడ్డి

బషీరాబాద్, ఆగస్టు 15: పర్వత్‌పల్లిలో ఇంతకాలం పనిచేసి బదిలీపై వెళ్లిన కార్యదర్శి సంజీవ్ కుమార్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ నాయకుడు, రిటైర్డ్ టీచర్ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగగా స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు శాలువలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాఘవరెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, వెంకటయ్య, రాంరెడ్డి, చంద్‌పాషా పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు దక్కిన పురస్కారం

జిల్లాలో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందించారు. రంగారెడ్డి జిల్లాలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లాలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఈ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులు, స్వాతంత్ర్య సమరయోధులు, తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి



రంగారెడ్డి కలెక్టరేట్‌లో కళా రూపాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు





వికారాబాద్





వికారాబాద్ కలెక్టరేట్‌లో విద్యార్థుల కళా ప్రదర్శన



మేడ్చల్





బంక్‌లో పెట్రోల్‌కు బదులు నీళ్లు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 15: ఫరూఖ్‌నగర్ మండలం బుచ్చిగూడ శివారులో ఉన్న బంకులో పెట్రోల్ పోయించుకుంటే నీళ్లు వచ్చాయని ఓ వాహనదారుడు గురువారం రాత్రి హల్‌చల్ చేశాడు. ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామానికి చెందిన తిరుపతయ్య బైక్‌లో 3 వందల పెట్రోల్ పోయించుకున్నాడు. స్వగ్రామానికి వెళ్తుండగా కొంతదూరం వెళ్లాక బైక్ ఆగిపోయింది. ట్యాంక్ ఓపెన్ చేసి చూడగా పెట్రోల్‌లో నీళ్లు కలిసినట్లు అనుమానించాడు. మళ్లీ బంకు వద్దకు వెళ్లి సిబ్బందిని ప్రశ్నించి గొడవకు దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి బైక్ నుంచి పెట్రోల్ తీశారు. పరీక్షలకు పంపనున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆమనగల్లు, ఆగస్టు 15: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు చేయూతనందించి ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా కోశాధికారి చైతన్యలు కోరారు. సీఐటీయూ అనుబంధ సంఘమైన భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికులకు అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం కార్మికుల సమావేశం నిర్వహించారు. రెండు దశాబ్దాలుగా ఇతర సంఘంలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య ఆధ్వర్యంలో సీఐటీయూలో చేరారు. సంఘం అధ్యక్షుడు డి. యాదయ్య, కార్యదర్శి యాదయ్య తదితరులు ఉన్నారు.



ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న మేడ్చల్ డీఆర్డీవో పీడీ సాంబశివరావు, మేడ్చల్ జిల్లా వైద్యాధికారి రఘునందన్‌స్వామి, డీఆర్వో హరిప్రియ

తాండూరులో 12 కొత్త పంచాయతీలు

- 173కు చేరిన జీపీల సంఖ్య
- పెద్దేముల్ మండలంలో అధిక జీపీలు
- గెజిట్ విడుదలతో పల్లెల్లో ఆనందం
- పాత వాటితో పాటే కొత్త పంచాయతీలకు ఎన్నికలు

తాండూరు, ఆగస్టు 15: తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 12 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో నియోజకవర్గంలో గ్రామ పంచాయతీల సంఖ్య 173కు చేరింది. ఈ మేరకు కొత్త పంయచాతీలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. నియోజకవర్గంలో ఎక్కువ గ్రామపంచాయతీలు ఉన్న మండలంగా పెద్దేముల్ ఉంది. వారం రోజుల్లో కొత్త గ్రామ పంచాయతీల్లో పరిపాలన ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పంపగా గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండడంతో ఏడాది సమయం పట్టింది. ప్రస్తుత గవర్నర్ బిల్లును ఆమోదించడంతో పాటు అసెంబ్లీలో తీర్మానించడంతో ఈ కొత్త పంచాయతీల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కొత్తగా పెద్దేముల్ మండలంలో గోపాల్‌పూర్, తింసాన్‌పల్లి, పెద్దేముల్ తండా, రచ్చకడ్డ తండా, ధారుస్‌వాగు తండా, యాలాల మండలంలో బాగాయిపల్లి, మల్‌రెడ్డిపల్లి, పేర్కంపల్లి తండా, దేవులా తండా (దుబ్బల తండా), బషీరాబాద్ మండలంలో గంగ్వార్, ఏర్యానాయక్ తండా, మల్కన్‌గిరి గ్రామాలు గ్రామపంచాయతీలుగా మారాయి. ప్రసుత్తం తాండూరు మండలంలో 33, బషీరాబాద్ మండలంలో 36 గ్రామ పంచాయతీలు ఉండగా కొత్త మూడు ఏర్పడగా 39 గ్రామ పంచాయతీలకు చేరుకున్నాయి. పెద్దేముల్ మండలంలో 374 గ్రామ పంచాయతీలుండగా కొత్తగా ఐదు ఏర్పడటంతో 42 గ్రామ పంచాయతీలుయ్యాయి. యలాల మండలంలో 37 గ్రామ పంచాయతీలుండగా నాలుగు కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడడంతో 41 గ్రామపంచాయతీలకు చేరాయి. కోట్‌పల్లి మండలంలో యథావిధిగా 18గ్రామ పంచాయతీలున్నాయి. ప్రస్తుతం 161 గ్రామ పంచాయతీలుండగా 12 పెరగటంతో గ్రామ పంచాయతీలు 173కి చేరాయి. పరిపాలన సౌలభ్యం కోసం 500 జనాభా ఉన్న తండాలు, పల్లెలను గత ప్రభుత్వం గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. కొత్తగా ఏర్పాడిన గ్రామపంచాయతీలకు పాత పంచాయతీలతో పాటే ఎన్నికల ప్రక్రియ చేపట్టే అవకాశముంది.

పీఆర్ ఎస్ఈ కార్యాలయం ప్రారంభం

వికారాబాద్, ఆగస్టు 15: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) కార్యాలయాన్ని గురువారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, మున్సిపల్ చైర్మన్ మంజుల రమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్

ఊరూవాడా
మువ్వన్నెల రెపరెపలు

స్వాతంత్ర్య వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. గురువారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలతో పాటు రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాలు ఎగురవేసి వందనం సమర్పించారు. ఊరూవాడా పండుగ వాతావరణం కనిపించింది. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. వారి చిత్రపటాలు, విగ్రహాల వద్ద నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పంద్రాగష్టు పురస్కరించుకొని నిర్వహించిన ఆటల పోటలకు సంబంధించి బహుమతులు అందించారు.


షాద్‌నగర్ : ఏసీపీ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ఏసీపీ రంగస్వామి


మహేశ్వరం : ఆర్మీ జవాన్లు, రైతులను సన్మానించిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


ఆమనగల్లు : జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


చేవెళ్ల : క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్యతదితరులు


శంషాబాద్ : స్వాతంత్ర్య వేడుకల్లో చైర్‌పర్సన్ సుష్మారెడ్డి తదితరులు


షాద్‌నగర్ అర్బన్ : వేడుకల్లో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేందర్


కొత్తూర్ : జెండాకు వందనం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేదందర్‌యాదవ్



కడ్తాల : పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న సీఐ శివప్రసాద్


శంషాబాద్ రూరల్ : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిర్వహించిన ఉత్సవాల్లో సీఈవో ప్రదీప్ ఫణీకర్, పోలీసులు, తదితరులు


కందుకూరు : విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న ఆర్డీవో సూరజ్‌కుమార్


షాద్‌నగర్ రూరల్ : ఇంచోడు పీహెచ్‌సీలో నిర్వహించిన జెండా పండుగలో పాల్గొన్న డాక్టర్ స్రవంతి


మంచాల : చెన్నారెడ్డిగూడ స్కూల్లో వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంపు


ఇబ్రహీంపట్నం : క్యాంపు కార్యాలయంపై జెండా ఎగరవేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


ఆదిభట్ల : మున్సిపల్ కార్యాలయం వద్ద జెండావిష్కరణ చేసిన చైర్మన్ నిరంజన్‌రెడ్డి


కేశంపేట : జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ మీర్ ఆజం అలీ


తలకొండపల్లి : లింగారావుపల్లిలో జెండా పండుగలో పాల్గొన్న టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్


మొయినాబాద్ రూరల్ : ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో జెండాకు వందనం చేస్తున్న లెఫ్టినెంట్ జనరల్ వైవీకే మోహన్ తదితరులు


శంకర్‌పల్లి : జెండా ఎగురవేసి వందన సమర్పిస్తున్న తహసీల్దార్ సురేందర్


చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో దేశభక్తి గేయంపై నృత్యం చేస్తున్న విద్యార్థులు


నందిగామ : వేడుకల్లో యువకులు, మాజీ ప్రజాప్రతినిధులు


మాడ్గుల : తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న డీటీ రాజశేఖర్


షాద్‌నగర్ : పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఆర్డీవో వెంకటమాధవరావు


యాచారం : జెండావిష్కరణ చేసిన జడ్పీహెచ్ఎస్ బాలికలు


కొందుర్గు : జెండావిష్కరణ అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులు, నాయకులు


షాబాద్ : పోలీస్‌స్టేషన్ వద్ద జెండా ఎగరవేస్తున్న ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి

ఘనంగా గాజుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

ఆమనగల్లు, ఆగస్టు 15: తెలంగాణ చేనేత ఐక్యవేదిక రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఆమనగల్లు చేనేత సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు.


పద్మశాలి సంఘం నాయకులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న గాజుల శ్రీనివాస్

మార్కండేయ స్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో పద్మశాలి సంఘం నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు. సంఘం నాయకులతో కలిసి శ్రీనివాస్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పద్మశాలి సంఘం నాయకులు సత్కరించి అభినందనలు తెలిపారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పద్మశాలి సంఘం నాయకులు ఎంగళి బాలకృష్ణ, భీమనపల్లి దుర్గయ్య, మల్లేశ్, అప్పం శ్రీను, ఎంగళి రఘు, రవి, ప్రసాద్, శ్రీధర్, శంకర్, సత్యం, పున్న వెంకటేశ్, అశోక్, నిరంజన్, వాసు, అప్పి, తదితరులు ఉన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, ఆగస్టు 15 : జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల దుస్థితిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో పారిశుధ్య సమస్యకు మోక్షం అనే శీర్షికన వచ్చిన కథనంతో మండలంలోని కుర్మిద్ద పాఠశాల ఉపాధ్యాయులు స్పందించారు. మంగళవారం సాయంత్రం ఉపాధ్యాయులు, పంచాయతీ కార్మికులతో పాఠశాల ఆవరణ శుభ్రం చేయించారు. కొందరు ఉపాధ్యాయులు కూడా పారపట్టి పనులు చేయడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.


మరమ్మతులు చేసిన మూత్రశాల, మరుగుదొడ్డి

ఉత్సవాలకు గ్రామ దేవతల ఆలయాలు ముస్తాబు

● నేటి నుంచి ఐదు రోజుల పాటు వైభవంగా వేడుకలు.. పెద్దఎత్తున ఏర్పాట్లు

కొత్తూర్, ఆగస్టు 15: మున్సిపాలిటీలో అత్యాధునిక హంగులతో నూతనంగా నిర్మించిన గ్రామ దేవతల ఆలయాలను పునఃప్రారంభించేందుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 16 నుంచి 23వరకు అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్స కార్యక్రమాలు కొనసాగనున్నాయి. మున్సిపాలిటీలో మూడు పోచమ్మ, నాలుగు మైసమ్మ, ఒకటి ఎల్లమ్మ ఆలయాలకు పునఃనిర్మాణంలో భాగంగా 9నెలల క్రితం దాదాపు రూ.2కోట్ల నిధులను దాతల సహకారంతో నిర్మాణం చేపట్టారు. అమ్మవార్ల విగ్రహాలను వరంగల్ నుంచి తీసుకురాగా, తమిళనాడుకు చెందిన పలువురు మేస్త్రీలు ఆలయాల నిర్మాణం పనులు చేపట్టారు. ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు భద్రత కల్పించాలి

షాబాద్, ఆగస్టు 15 : బంగ్లాదేశ్‌లో హిందువులకు భద్రత కల్పించాలని భజరంగ్‌దళ్ విభాగ్ కో-కన్వీనర్ గూడెం రమేష్ అన్నారు. గురువారం షాబాద్‌లో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో హిందూ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులు, సిక్కులు, ఇతర మైనార్టీలపై దాడులను అరికట్టి భద్రత కల్పించాలన్నారు. హిందువుల భద్రత, మానవ హక్కుల పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, హిందువులపై దాడులకు నిరసనగా రేపు షాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో
గుర్తుతెలియని వ్యక్తి మృతి

శంకర్‌పల్లి, ఆగస్టు 15: మీర్జాగూడ అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డి నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రారెడ్డినగర్‌లోని సైకిల్ ట్రాక్ పక్కన గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉండగా గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వెళ్లి వివరాలు సేకరించారు. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు 55 ఉంటుందని, వడదెబ్బతో గాని, ఆకలితోగాని చనిపోయి ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కిరాణ షాపులో మద్యం పట్టివేత

శంకర్‌పల్లి, ఆగస్టు 15: మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో గురువారం సాయంత్రం ఓ కిరాణ దుకాణంలో అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు కిరాణ దుకాణంపై దాడిచేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

కడ్తాల్/షాబాద్/చేవెళ్ల, ఆగస్టు 15: కడ్తాల తహసీల్దార్ ముంతాజ్ జిల్లాస్థాయిలో ఉత్తమ అధికారిగా ఎంపిక య్యారు. ధరణి భూ సమస్యల పరిష్కారానికి, అంకిత భావంతో విధులు నిర్వహించినందుకు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించినందుకు జిల్లా స్థాయిలో ఉత్తమ తహసీల్దార్‌గా ప్రభుత్వం ఎంపిక చేసింది. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి, శంకర్‌లతో కలిసి కలెక్టర్ శశాంక ముంతాజ్‌కు ప్రశంసాపత్రం అందజేశారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన షాబాద్ మండల ఏపీవో వీరాసింగ్‌కు కలెక్టర్, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, మల్‌రెడ్డి రంగారెడ్డిల చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. అలాగే చేవెళ్ల ఎంపీడీవో హిమబిందుకు ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రం అందుకున్నారు.

సంక్షిప్తంగా..

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మున్సిపాలిటీ 2వ వార్డు ప్రాథమిక ఉపకేంద్రం వద్ద ఎగురవేసి జాతీయ జెండా విషయంలో అపశృతి చోటుచేసుకుంది. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కౌన్సిలర్ సంధ్యారాణి సరిగా చూసుకోకుండా జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేయారు.

కందుకూరు : మండల కేంద్రానికి చెందిన కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్త ఉత్తమ పురస్కారం అందుకున్నారు. రంగారెడ్డి జిల్లా కెమిస్ట్ మరియు డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన ఉత్తమ పురస్కార ప్రదానోత్సవంలో భాగంగా ఆయన్ను ఎంపిక చేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు కృష్ణకుమార్ తెలిపారు.

ఆమనగల్లు : పారిశుధ్య కార్మికులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రజాసంఘాల రాష్ట్ర నాయకుడు జంతుక శంకర్ అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న కార్మికులు ఏళ్లకాలంగా చాలీచాలని వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.

యాచారం : మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాలలో సమస్యలు పేరుకుపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని 2002-03 పదో తరగతి విద్యార్థులు తలాకొంత నగదు వసూలు చేశారు. మొత్తం రూ.52.250 పాఠశాల బ్యాంక్ ఖాతాలో జమచేయాలని టీచర్లను కోరారు.

కేశంపేట : మండల కేంద్రంలో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని, వాటిని నియంత్రించాలని గ్రామ యువత ఎస్సై రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కొందరు మద్యం సేవించి కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతున్నారని తెలిపారు. మురళి, పవన్ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు ట్రస్ట్ సేవలు

కడ్తాల్, ఆగస్టు 15: జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలను కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మారుమూల గ్రామాలకు విస్తరిస్తామని ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండలంలోని పోచమ్మగడ్డ తండాకు చెందిన జర్పుల దశరథ్ నాయక్ తన కుమారుడు దివంగత రాధాకృష్ణ పేరిట చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఐదేళ్ల కాలంగా ప్రజలకు సేవలందిస్తున్నారు. రాధాకృష్ణ జయంతి సందర్భంగా గురువారం కడ్తాల మండలంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పలు గ్రామాలు, తండాల్లో దశరథ్ నాయక్ ప్రకటించారు. గాన్గుమర్ల తండాలో హనుమాన్ ఆలయానికి రూ.10.1లక్ష, తుల్జామాత మందిరానికి రూ.51వేలు, రేక్య తండాలో సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాత మందిరాలకు రూ.51 వేలు, రావిచెడ్‌లో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి రూ.51 వేలు, మక్తమాదారంలో మైసమ్మ ఆలయ నిర్మాణానికి రూ.51వేల విరాళం అందజేశారు. పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతిచెందిన 40 మందికి సంబంధించి బాధిత కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం చేశారు. కడ్తాల మండల మహిళా సమాఖ్య కార్యాలయానికి 40 కుర్చీలు అందజేశారు.


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దశరథ్ నాయక్

పేదల భూములు పేదలకే దక్కాలి

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

ఆమనగల్లు, ఆగస్టు 15: పేదల భూములు పేదలకే దక్కాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు భూస్వాములు చట్ట విరుద్ధంగా పట్టా భూములుగా మార్చికొని రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పేదల భూములు పేదలకే దక్కాలన్న నినాదంతో బహిరంగ సభ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడి కురుమయ్య అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సభలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, రైతు సంఘం నేతలు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభకు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.వెంకట్‌రాములు, జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ భూస్వాములు అక్రమంగా స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూములు తిరిగి స్వాధీనం చేసుకొని భూమి లేని పేదలకు పంచాలని కోరారు. చట్టబద్ధంగా తమకు దక్కాల్సిన భూముల కోసం పోరాటం చేస్తున్నారని పేదలపై అక్రమంగా బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖానాపూర్‌లో పేదలకు దక్కాల్సినటువంటి వందల ఎకరాల ప్రభుత్వ భూమలను భూస్వాములు చట్ట విరుద్ధంగా పట్టా భూములుగా మార్చుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకోవడం నేరమని అన్నారు.